క్లుప్తంగా

జోనల్ కమిషనర్‌కు అభినందనలు



జోనల్ కమిషనర్ శివప్రసాద్‌ను అభినందిస్తున్న కర్రి నీలకంఠం తదితరులు

అల్లిపురం: జోన్–4, జోనల్ కమిషనర్ శివప్రసాద్ పదోన్నతిపై ఏలేశ్వరం కమిషనర్‌గా బదిలీపై వెళుతున్న సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకలు అభినందనలు తెలిపారు. 33,34,35,41 వార్డుల మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం ఆధ్వర్యంలో 33వ వార్డు సీనియర్ నాయకులు బొడ్డేటి ప్రసాద్, కొడమంచిలి శ్రీను, పిల్లి శివ, కణితి బ్రహ్మాంలు బుధవారం జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బత్తిన నవీన్

దాబాగార్డెన్స్: విశాఖ పోర్టు స్టేడియం వేదికగా ఉత్తరాంధ్ర మైగ్రేటెడ్ ముస్లిం మైనార్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 3 రోజుల పాటు నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్‌ను 31వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు బత్తిన నవీన్ కుమార్ బుధవారం ప్రారంభించారు. పోటీల్లో పాల్గొనే ఇరు జట్లను పరిచయం చేసుకున్న బత్తిన విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు అంకిత్, సభ్యులు ఆహ్లాద్, అఫ్సర్‌ఖాన్, అర్జి రాజేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

జేసీతో ఉద్యోగుల భేటీ



జేసీ మయూర్ అశోక్‌ను అభినందిస్తున్న జిల్లా నాల్గోవ తరగతి ఉద్యోగుల సంఘం నేతలు

మహారాణిపేట: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె.మయూర్ అశోక్‌ను నాల్గోవ తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. జేసీని కలిసిన వారిలో సంఘం సహ అధ్యక్షుడు ఎస్.లోకేశ్వరరావు, నాయకులు ఐ.ఆనంద, ఎస్సార్ రమణ, మౌనిక, నిర్మల, కనకమహాలక్ష్మి, జగత్తులక్ష్మి, జయలక్ష్మి తదితరులు ఉన్నారు.

అప్పన్న సన్నిధిలో దేవదాయశాఖ ట్రిబ్యునల్ న్యాయమూర్తి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న హరినాథ్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం రాష్ట్ర దేవదాయశాఖ ట్రిబ్యునల్ న్యాయమూర్తి హరినాథ్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంబాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక,శేషవస్త్రాన్ని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు.



పెద్ద ఎత్తున సభకు హాజరైన మహిళలు

మాట ఇవ్వడం వేరు..అది నెరవేర్చుకోవడం వేరు..మాట ఇచ్చింది మడమ తిప్పని నేత..మనసున్న నాయకుడు..ఆయన మాట ఇచ్చాడంటే ఇక అది నెరవేరినట్టేనని నాలుగున్నరేళ్లుగా ప్రజలు బలంగా నమ్ముతున్నారు. ప్రజల నమ్మకాన్ని నెలబెట్టేలే ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారు. సంక్షేమ పథకాలు అనుకున్నప్రకారం అమలు చేస్తున్నారు. తాజాగా వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా నాలుగో విడత నిధులను మీటనొక్కి ఆయన అక్కచెల్లెమ్మల ఖాతాలో జమ చేశారు. ఈ సందర్భంగా విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ఆసరా సంబరాలు మిన్నంటాయి. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు. – డాబాగార్డెన్స్

ఆసరాతో. వెలుగులు

- దక్షిణంలో అంబరాన్నంటిన సంబరాలు
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం
- నియోజకవర్గంలో నాలుగేళ్లలో ఆసరా కింద రూ.65.59 కోట్లు జమ



వివిధ సంక్షేమ ఫలాలతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చిత్రం నడుమ రంగు రంగుల ముగ్గు వేసిన డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు



సీఎం జగన్ చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ



మహిళా సంఘాలకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, కోలా గురువులు

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ఆసరా నాలుగో విడత కార్యక్రమానికి అన్ని వార్డుల నుంచి పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చారు. టర్నర్ చౌల్ట్రీ వేదికగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన నాల్గో విడత సంబరాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ, జోనల్ కమిషనర్ శివప్రసాద్, పలువురు పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు హాజరయ్యారు. జై జగన్..జై వాసుపల్లి అంటూ నినాదాలతో ప్రాంగణం మార్మోగింది.

అంతా పారదర్శకంగా...

పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలాగురువులు, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్‌గాంధీ మాట్లాడుతూ నాలుగేళ్లలో 2 లక్షల 60 వేల కోట్లు సంక్షేమ ఫలాలు పేద, బడుగు, బలహీన వర్గాలకు నేరుగా అందాయన్నారు. అటువంటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వంద మంది చంద్రబాబులు..వెయ్యి మంది పవన్ కల్యాణ్‌లు వచ్చినా ఏమీ చేయలేరన్నారు. ఎక్కడా కూడా అవినీతి లేకుండా పరిపాలన సాగుతోందన్నారు. వయో వృద్ధులు..దివ్యాంగులు, వితంతువులకు నేరుగా వారి ఇళ్లకు వెళ్లి వలంటీర్లు పింఛన్లు అందజేయడమే గాక వేలు..లక్షలు ఖర్చు అయ్యే వైద్య సేవలు కూడా అందివ్వడం గొప్ప విషయమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రెండేళ్లు కరోనా ఉన్నా..ఎక్కడా కూడా సంక్షేమ పథకాలు ఆగిపోలేదన్న విషయాన్ని యావత్ రాష్ట్రం గుర్తించిందన్నారు. ఇక అభివృద్ధి విషయానికొస్తే..శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి జరిగిందని చెప్పారు. రాష్ట్రంలో సీనియర్ నాయకుడు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు సింగిల్‌గా జగన్‌ను ఎదుర్కోలేకపోతున్నారని..అది మా నేత స్టామినా అని పేర్కొన్నారు. ప్రతిపక్షాల తాటతీసే సమయం ఆసన్నమైందని..అందుకు మీ మహిళలంతా ఒక్కటై జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు.

మచ్చలేని మహానేత జగన్

ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డితోనే మహిళాభివృద్ధి సాధ్యపడుతోందని, కేవలం దక్షిణ నియోజకవర్గంలోనే 2678 గ్రూపులకు గాను 26,906 మంది సభ్యులకు ఇప్పటి వరకు ఆసరా కింద రూ.65,59,39,000 లబ్ధి చేకూరిందన్నారు. అవినీతి లేకుండా పారదర్శకంగా అందిస్తున్న సుపరిపాలన చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు చేస్తున్న కుటిల రాజకీయాలను వచ్చే ఎన్నికల్లో తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మీరంతా 2024 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని పిలుపునిచ్చారు. ఐదు లక్షలలోపు ఆదాయం కల్గిన ప్రతి పేద, మధ్య తరగతి కుటుంబాలకు రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారని చెప్పారు. నియోజకవర్గంలోనే పాత పట్టణానికి కొత్త రూపు రేఖలు వచ్చే విధంగా రూ.140 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే వాసుపల్లి తెలిపారు. జగదాంబ నుంచి పాతపోస్టాఫీస్ కనిపించేలా విశాలమైన 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట పద్మావతి, కోడూరు అప్పలరత్నం, పల్లా అప్పలకొండ, కోడిగుడ్ల పూర్ణిమ, మండల అధ్యక్షులు కొల్లి సింహాచలం, పీతల వాసు, బాపూ ఆనంద్, కోడిగుడ్ల శ్రీధర్, కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ షరీఫ్, పార్టీ నాయకులు సబీరా బేగం, లక్ష్మీ, బొర్రా విజయలక్ష్మీ, రామలక్ష్మీ, ముజీబ్‌ఖాన్, రామానంద్, మైకేల్ రాజు, పచ్చిరపల్లి రాము, అశోక్‌కుమార్, బోని దేవా, డేవిడ్‌రాజు,అలపున కనక రెడ్డి, నొల్లు పోతుస్వామి, ఏపీడీ పుణ్యవతి, పలు ఆలయాల చైర్మన్లు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజువీధి రామచంద్ర పాఠశాలకు ఎదురుగా గల తోటలో నివాసముంటున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త బుడుమూరు వెంకటరమణ తల్లి బుడుమూరు సీతమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు సీతమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. దహన సంస్కరణల కోసం రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి అన్ని విధాల సహాయ సహకారాలుంటాయని భరోసా కల్పించారు.

రహదారులు శుభ్రంగా ఉంచాలి



టౌన్‌కొత్తరోడ్డు వద్ద రహదారులు పరిశుభ్రం చేయిస్తున్న ఏఎంహెచ్‌ఓ ఎ.రాజేష్

జగదాంబ: రహదారులు శుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో ఎ.రాజేష్ అన్నారు. బుధవారం జోన్ పరిధిలో పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. 35వ వార్డు గాజులవీధిలో రహదారులను పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్ పరిధిలో అన్ని వార్డులు శుభ్రంగా ఉంచాలన్నారు. రహదారులపై చెత్త కుప్పలు లేకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బాధ్యతగా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజార్ కిశోర్, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పర్యవేక్షణ



కొండవీధిలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు, జేసీఎస్ అర్బన్ క్లస్టర్ ఇన్‌చార్జ్ కోడిగుడ్ల శ్రీధర్, ఇంజినీరింగ్ విభాగాధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. వార్డులో 24/7 పైప్‌లైన్ల కోసం తవ్విన గుంతలు పూడ్చే పనులను ఆయన ప్రారంభించారు. వార్డు ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్యామ్ సుందర్, రమేష్, కల్యాణ్, కోటి, ప్రసాద్, ఏతఃశ సతీష్, కాంట్రాక్టర్ సత్యనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌వోల డైరీ ఆవిష్కరణ



వీఆర్‌వోల డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం (వీఆర్‌వో) ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బదిలీ అయిన జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్‌వో కె.మోహనకుమార్, ఆర్‌డీవోలు డి.హుస్సైన్ సాహెబ్, భాస్కరరెడ్డి, ఉమ్మడి రాష్ట్ర గ్రామ,రెవెన్యూ అధికారులు ఈర్లె శ్రీరామ్మూర్తి, జిల్లా అధ్యక్షుడు పి.వెంకట అప్పారావు, ప్రధాన కార్యదర్శి జి.దేవరాజ్,పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు ఏపీఈఆర్సీ చైర్మన్ నాగార్జునరెడ్డి పూజలు



జస్టిస్ నాగార్జునరెడ్డికి అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని బుధవారం ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట స్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాన్ని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆయనకు అందించారు.

ఆర్‌ఐవోగా సత్యనారాయణ సేవలు అమోఘం



విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారిగా పనిచేస్తూ బుధవారం ఉద్యోగ విరమణ చేసిన రాయల సత్యనారాయణ సేవలు అమోఘమని ఆర్‌ఐవో కార్యాలయ సూపరింటెండెంట్ గణేష్ అన్నారు. కార్యాలయ అధికారుల, సిబ్బంది అంతా బుధవారం సత్యనారాయణకు ఘనంగా వీడ్కోలు పలికారు. పుష్పగుచ్ఛాలను అందజేసి, శాలువతో సత్కరించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి, ఎంతో అమూల్యమైన సలహాలు, సూచనలు అందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మురళి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుబ్బరాజు మృతి తీరనిలోటు

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని రాఘవేంద్రరావు



సుబ్బరాజు చిత్ర పటం వద్దనివాళులర్పిస్తున్న సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని రాఘవేంద్రరావు తదితరులు

అల్లిపురం: సీపీఐ సీనియర్ నాయకుడు, జాతీయ బ్యాంకుల యూనియన్ పూర్వ నేత, విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ పూర్వ పాలకవర్గ సభ్యుడు కె.వి.సుబ్బరాజు అకాల మృతి కార్మిక వర్గానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని రాఘవేంద్రరావు అభిప్రాయపడ్డారు. కె.వి.సుబ్బరాజు సంతాప సభ బుధవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.ఎస్.జె.అచ్యుతరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ సుబ్బరాజు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేశారని, ముఖ్యంగా గ్రామిక వర్గం విముక్తికి, కమ్యూనిస్టు పార్టీ పటిష్టతకు ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సత్యనారాయణ, కె.సత్యాంజనేయ, ఎస్.కె.రెహమాన్, పి.చంద్రశేఖర్, క్షేత్రపాల్, బ్యాంక్ సహాయ ముఖ్య నిర్వహణ అధికారి వరలక్ష్మి, యూనియన్ నేతలు ఎర్రయ్యరెడ్డి, రెడ్డి శ్రీనివాస్, విశాఖపట్నం హార్బర్ అండ్ పోర్టు వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బీసీహెచ్ మసేను, సీనియర్ నాయకులు దేవరకొండ మార్కండేయులు పాల్గొన్నారు. సుబ్బరాజు మృతి పార్టీకి తీరని లోటని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ వెళ్లి సుబ్బరాజు అంతిమయాత్రలో పాల్గొని నివాళులు అర్పించారు. సుబ్బరాజు పార్థివదేహాన్ని పాడి మోసి దహన సంస్కారాలు నిర్వహించారు.

నేడు సహస్ర తులసీ అర్చన

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి ఆలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500 రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ట్రాన్జక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

రౌడీషీటర్లపై నిఘా

నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్

అల్లిపురం: నగరంలోని అన్ని పోలీస్ స్టేషన్లలో గల రౌడీషీటర్లపై నిఘా పెంచాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ ఆదేశించారు. బుధవారం పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ట్రాఫిక్, క్రైం, శాంతిభద్రతలు, స్పెషల్ బ్రాంచ్‌లకు వేర్వేరుగా సమీక్ష సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా నగరంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్రమ మద్యం, నగదు, ఇతర అనుమానిత వస్తువులను పూర్తిగా నివారించేలా అన్ని వాహనాలను నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఎన్‌డీపీఎస్ రవాణాకు అడ్డుకట్టకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో రాత్రిపూట నిఘా మరింత పటిష్టంగా అమలు చేయాలన్నారు. అన్ని పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన, జగనన్నకు చెబుదాం, డయల్ 112లకు వచ్చే ఫిర్యాదులను నిర్ణీత కాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో పోలీస్ ఉన్నతాధికారులు, లీగల్ అడ్వయిజర్లు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ



గోడౌన్‌కు వేసిన సీల్ పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

ఆరిలోవ: రూరల్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోడౌన్‌ను బుధవారం కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా భీమిలి ఆర్డీవో భాస్కర్‌రెడ్డి, రూరల్ తహసీల్దార్ రమణయ్యతో కలసి ఆయన గోడౌన్‌కు వేసిన సీల్, లోపల ఉన్న వీవీ ప్యాట్లు, ఇతర సామగ్రిని పరిశీలించారు. సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి.. సిబ్బంది విధులపై ఆరా తీశారు. భద్రత ప్రమాణాలు పాటించాలని వారిని ఆదేశించారు. ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారుడికి ఘన స్వాగతం



విశాఖ విమానాశ్రయంలో ప్రకాష్‌కు స్వాగతం పలుకుతున్న పాండ్రంకి రుక్మాకరరావు

గోపాలపట్నం: థాయ్‌లాండ్‌లో ఇటీవల జరిగిన తైక్వాండో పోటీల్లో వెండి పతకం సాధించిన మూలపర్తి ప్రకాష్‌కు విశాఖ విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. థాయ్‌లాండ్ నుంచి బుధవారం రాత్రి విశాఖ వచ్చిన ఆయన్ని ఆల్ ఇండియా మెగాస్టార్ చిరంజీవి స్పోర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ పాండ్రంకి రుక్మాకరరావు, సహచర క్రీడాకారులు పూలమాలలు, శాలువలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ ఈ 25 నుంచి 27వ తేదీ వరకు థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో దేశానికి వెండి పతకం అందించడం ఆనందంగా ఉందన్నారు. తనకు శిక్షణ ఇచ్చిన కోచ్ రుక్మాకరరావు, ప్రోత్సహించిన కుటుంబసభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. డానియల్ మాస్టార్, యనమరెడ్డి కనకరెడ్డి, హేమలతా రెడ్డి, అంజలిరెడ్డి, క్రీడాకారులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దాడి కేసులో ఏడేళ్లు జైలు

అక్కిరెడ్డిపాలెం: యువకునిపై దాడి చేసిన వ్యక్తికి గాజువాక కోర్టు 7 ఏళ్ల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధించింది. గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం.. 2019 నవంబర్ 28వ తేదీన గాజువాక గాయత్రి బార్ అండ్ రెస్టారెంట్ వద్ద షేక్ అబ్దుల్లా అతని స్నేహితుడిని చంపేస్తానని బెదిరించడంతోపాటు బీర్ బాటిల్‌తో కుడి చేతి మీద, గెడ్డం మీద పొడవటంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు గాజువాక పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ బి.బి.ఎస్.గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జిషీట్ వేయగా గాజువాక మేజిస్ట్రేట్ జి.షణ్ముఖరావు విచారణ అనంతరం పై విధంగా తీర్పు ఇచ్చారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని వినతి



కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

డాబాగార్డెన్స్: విశాఖ దక్షిణ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కోరుతూ జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎంతో పారదర్శకంగా కేవలం దక్షిణ నియోజకవర్గ అభివృద్ధికి రూ.140 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ ప్రభుత్వ హయాంలోనే జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ రాణిబొమ్మ వరకు 60 అడుగుల రోడ్డు విస్తరణ, ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి తదితర పనులు అదనంగా జరుగుతున్నాయన్నారు. సత్యనారాయణ స్వామి ఆలయ ఘాట్‌రోడ్డు, అనకాపల్లి ఏరియాలో మంజూరైన ఇళ్లకు బదులుగా వేరే చోట గృహాలు మంజూరు చేయాలని ఆ వినతిలో పేర్కొన్నారు. 60 అడుగుల రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. తెల్లరేషన్‌కార్డు కల్గిన ప్రతి ఇంటికి మంచినీటి కనెక్షన్ వెయ్యాలని కోరారు. 39వ వార్డు ఫెర్రీరోడ్డు పెద్ద కాల్వలో పడి ప్రమాదవశాత్తు చనిపోయిన యువకుడి కుటుంబ సభ్యులకు జీవీఎంసీ ద్వారా నష్టపరిహారం అందజేయాలన్నారు.